# ప్రేమ-పర్యవసానం

**సుం**దరశివరావు కాంగ్రెస్‌పాకలో ఒక మూల ఆఫీసు తెరిచాడు. వెనుక పెద్ద రామ పట్టాభిషేక పటమూ, ఒకరిద్దరు కాంగ్రెసు నాయకులూ, ముందు పెద్ద పెద్ద అద్దకాలతెరా, కింద తివాసీ. వెనక బాలీసూ, కాయితాలూ, పుస్తకాలూ ముందూ, స్నానంచేసి, జుట్టుదువ్వి, తెల్లని ఖద్దరుపంచా, కుర్తా, టోపీ ధరించి కూచుంటే, అతని మనసుకి అతనికే కొంత ఘనత కలిగింది. బయిటనించి జనసమ్మర్దపు రొదా, రెండు మూడు భాషలలో అప్పుడప్పుడు కీర్తనలూ, తాటాకువాసనలతో కలిసి వాయిద్యాలూ, వినపడుతున్నాయి. కాంగ్రెసు భవనాలు యుద్ధ శిబిరంవలెనూ, తానొక నాయకుడివలెనూ, తనకింద వాలింటీర్లు సేనవలెనూ, నాయకులు పూజ్యులయిన దండనాయకులవలెనూ తోస్తున్నారు అతనికి. చలిలో చన్నీళ్ళ స్నానమూ; కడుపులో వేడికాఫీ అతనికి శరీరస్వస్థతకు తోడుపడ్డాయి.

సుందరశివరావుది కాకినాడ. చిన్నతనంనుంచీ అతనికి హిందూమతమూ, పురాణాలూ, అగ్రదేవతలూ అంటే చాలాభక్తి. హిందు మతోద్ధారకులైన నానక్, శివాజీ, తుకారం, తిలక్ మొదలయిన వారెప్పుడూ అతని ఆదర్శ ప్రపంచంలో విహరిస్తోవుంటారు. కాని దేవతలందరిలోను శ్రీరాముడాతని యిష్టదైవం. రాముడి ధర్మశీలమూ, విధేయతా, ధర్మం కోసం త్యాగమూ అన్నీ శివరావు స్వభావానికి 'అప్పీల్' ఐనాయి.

సుందరశివరావు మొదటనించీ తన జీవితాన్ని మతానికి, ఆ మతానికి నిలయమైన దేశానికీ అర్పించ తలచుకున్నాడు. తనతోడి విద్యార్థులతో హిందూమత పునరుద్ధరణ చెయ్యపూనుకుంటే, వాళ్ళ మనసులు దీక్షా రహితం కావడంచాతా, వాళ్ళ ఆశయాలన్నీ పరీక్ష కృతార్థతమీదా, ఫుట్‌బాల్‌మీదా, సురభినాటకాల మీదా చలిస్తో వుండడంచాతా, బ్రహ్మసమాజ బోధనలచాత కులాచార సమస్యలు బయలుదేరడంచాతా, అతని ప్రయత్నం సాగక హిందూపరిపాలన దేశానికి తటస్థిస్తేనే కాని మతోద్ధారణ వీలులేదని నిశ్చయించుకున్నాడు. బ్రహ్మచర్యం పూనాడు. సంసారం యే దీక్షకుకూడా ప్రథమ అభ్యంతరం.

నాలుగువేలు కట్నమిస్తామని సంబంధం తటస్థించింది. పీటలమీద కూచుంటావా యింటోంచి నడుస్తావా అన్నాడు తండ్రి. గారాబంగా పెరిగినవాడు కావడంచాత, యెంత మతభక్తి వున్నా అతని తల్లినీ, బంధువుల్నీ విడవడం చాతకాదు. అదిగాక బి.ఏ. ఐతేనేకాని, మతంలోగాని, దేశంలోగాని గౌరవముండదు. అసలు సంగతి తండ్రిని చూస్తే అమితభయం. కనక బ్రహ్మచర్యాదర్శాధిక్యతను ప్రశ్నించి, ఏమో, ఏ కారణంచేత శ్రీరాముడు గృహస్థాశ్రమాన్ని అవలంభించాడో అని, తర్కించుకుని, సంతానాభివృద్ధిని వేదాలు విధిగా ఆదేశించిన విషయం జ్ఞాపకం తెచ్చుకుని, రాముణ్ణి ఆదర్శంగా, బ్రహ్మచర్య ఆదర్శాన్ని

పితృవాక్య పరిపాలనకింద మార్చి, పెళ్ళిచేసుకున్నాడు. భార్య కాపరానికి రాగానే ఏకపత్ని వ్రతం తనకి. పాతివ్రత్యం భార్యకూ ముఖ్యవిధులని నిర్దేశించి, పాతివ్రత్యమేమిటో (ఆ పాతివ్రత్యమేమిటో యెరగని ఆ కమలకు), పురుషులంటే మనసు చలించడమూ, ఆకర్షణా, నిగ్రహమూ మొదలైనవన్నీ బోధించాడు.

కాకినాడకు కాంగ్రెస్ వొచ్చినప్పుడు సుందరశివరావు వాలంటీర్ల అధిపతికింద చిన్న అధిపతి ఐ ప్రత్యేకంగా ఆఫీసు తెరిచాడు. కమల స్త్రీ వాలంటీర్లలో చేరింది. యెంత బోధించినా కమలకు యీ మతభక్తి, దేశభక్తి వొంటబట్టలేదు. భర్త ఆవేశమూ, భక్తీ, వాటి అర్థమేమిటో ఆమె ప్రశ్నించుకోలేదు. ఆమె అన్నకి దగ్గువలెనే, ఆమె తల్లికి ఆచారంవలెనే, కోడికి కుయ్యడంవలేనే, భర్తకి అదో స్వభావమని అంగీకరించింది. కాని ఈ కాంగ్రెసు పని చాలా తమాషాగావుంది. ఇదివరకల్లా కమలకి దేశభక్తి ఏ పుస్తకంలోనో నాలుగుపేజీలు కంఠతా వల్లించడమూ భర్తయిచ్చే లెక్చరు రూపంలో కనబడేది.

ఇప్పుడా దేశభక్తి చాలా ఆకర్షక రూపాన్ని ధరించింది. పాటలూ, పహరాలూ, గంతులూ.

సుందరశివరావుకి యీ ఆడవాళ్ళింత స్వేచ్ఛగా మొగవాళ్ళ మధ్య తిరగడం రుచించలేదు. స్త్రీ దేశసేవ చేయవలసిందే కాని స్త్రీ శాఖ ప్రత్యేకంగావుండి, మొగవాళ్ళతో సంబంధం వుండకుండా వుండాలని అతని వుదేశ్యం అది యెట్లా సాధ్యమో ప్రస్తుతం తోచలేదు. కాని ఒక ప్రణాళికను సిద్ధం చెయ్యాలని యోచిస్తున్నాడు.

అదిగాక యీ మూడురోజులనుంచి చూడగా యీ నాయకులకెవరికీ మతాభిమాన మున్నట్టులేదు. చాలామంది నిరీశ్వరవాదులుగా వున్నారు. అంత యెక్కువగా యీ మహమ్మదీయుల మతంతో చేతులు కలపడం హిందూమత సాంప్రదాయానికి విరుద్ధంగా కనపడుతోంది. ఈ అస్పృశ్యతకూడా ఆలోచించవలసిన విషయమే! కాని, యీ ప్రస్తుత నాయకులు స్వరాజ్యాన్ని సంపాయిస్తే, తాను హిందూమత పునరుద్ధరణ చెయ్యావొచ్చు.

బైట పకపకమని నవ్వు వినబడ్డది. ఆ నవ్వు తన ధ్యాసల నన్నిటినీ చెదరగొట్టి వెన్నెలనూ, పువ్వులనూ వెదజల్లుతోంది. విసుక్కున్నాడు. మాటిమాటికీ, తన ఆఫీసులోకి ఆ తెరను ఒక్క వూపుతో పక్కకి లాగేసి, యిసికను తివాసీమీదికి చిమ్ముకుంటో, ప్రతి చిన్న పనికీ, అనుమానానికీ, తన ఆఫీసులోకి వొస్తుంది ఆ బెంగాలీపిల్ల నిర్మల. రామభక్తిలో, కాంగ్రెసు సేవలో, వాలంటీర్ల విధులతో, కంప్లెయింట్లతో, ఏక పత్నీవ్రతంతో నిండివున్న అతని మనసు ఆమెని చూడగానే, యమునా ప్రవాహమూ, *సందేశాల మాధుర్యమూ, చంపకపువ్వుల వాసనా, విప్లవోద్యమ తీవ్రతా. వీటివేపే పరిగెత్తి కలవరపడుతోంది. కాని అతనికి మనసులో ఆమె వొదిలివెళ్ళే గొప్ప అశాంతి మాత్రమే గుర్తు తెలుసు. ఆమె ప్రతి యువ్వనుడితోనూ బుజాలమీద చేతులు వేసి 'భాయీ' అంటూ గంతులు వెయ్యడం,

* ఒకరకం బెంగాలి మిఠాయి సందేశ్

ప్రతి ముసలివాణ్ణి (కాంగ్రెసు మహానాయకులనన్నా వొదలక) వెక్కిరిస్తో నవ్వడం అతనికి రుచించలేదు. కాని యువకుడి ఖద్దరు భుజంమీద మెత్తని జరీతో అల్లిన భుజకీర్తులవలె కనపడే ఆమె వేళ్ళనుగాని ఆకాశంలో ఎగిరే చిలకల అరుపులవలె, తాటాకుదళ్ళలోంచి, దేశసేవాతత్పరులైన హృదయాల్లోంచి, భీషణములైన బిరుసుగడ్డాల్లోంచి, దూసుకుపొయ్యే ఆమె నవ్వునించిగాని, అతను మనసు మళ్ళించుకోలేక పోతున్నాడనే సంగతి అతనికింకా తెలీదు. ఒక్కొక్క మాటకు పది చిరునవ్వులు, నాలుగు సంగతులు చెప్పేలోపల ఐదారు గంతులూ, యెవరితో మాట్లాడినా వారిమీదే చాలా యిష్టమున్నట్టు చూపులూ-పాండవ శిబిరంలో వుత్తర జ్ఞాపకం వొస్తోంది అతనికి. అభిమన్యుడెవరు!

నిర్మల ఆ తెరను చేతితో పక్కకు నెట్టకండానే ఆఫీసులోకి తట్టెడు యిసిక చిమ్ముకుంటో దూకి, తివాసీమీద పడి, బాలీసు వెనకనక్కింది.

"రక్షించండి, రక్షించండి! శరణాగతురాలను. ఆర్త శరణ్యా! మీరే దిక్కు నాకు."

చప్పున లేచి అతను "ఏమిటి?" అన్నాడు.

"ఈ ముసలివాళ్ళు-ముసలివాళ్ళు-పోనీ ముసలి నాయకులు వొస్తే వొచ్చారు. ఈ ముసలినాయకురాళ్ళెందుకు మనకు? మనకి కూరవొడ్డించాలా, ఆ కుర్రాణ్ణి డెలిగేటుగా పెట్టి ఈ ముసలమ్మల్ని వొడ్డనలో పారెయ్యకూడదా?"

ఇదేదో హేళన అనుకుని, తన కలవరానికి సిగ్గుపడి, అతను వూరుకున్నాడు.

"ఏం జరగిందో అడగరేం!"

"అవును."

నిర్మలకు నవ్వు ఆగటంలేదు.

"శాంత స్నానంచేసి, బట్టలకోసం పెట్టె వెతుకుతోవుంటే నేను చేరాను...హా! హా! హా! దాంటో ఏముందంటారు. పెద్దపరికిణీ! దాన్ని చేతులు విరిచి పైకిలాగి దానికే కట్టాము-హా!, హా! హా!...... డాన్సు.... హాహాహా-నేను పెట్టెమీద తబలా, ఆ మదరాసిపిల్ల నోటితో హార్మోనియం.....ఇంతలో దండనాయకురాలు వొచ్చింది, హా, హా, హా, చీవాట్లు! వింటేనా మేము! ఇంతలో లలిత అంది కదా, "నువ్వు కాంగ్రెసు నాయకుల వెనక డాన్స్ చేయడంకంటే అన్యాయమూ." కొట్టింది లలితని. "లలిత కొట్టిందని ఇప్పుడు రిపోర్టు."

"అక్రమం!"

"ఏమిటి అక్రమం....కొట్టడమా, డాన్సా?"

"అంతా."

"సాయంత్రం యీ ఆఫీసులో డాన్సు. అప్పుడే కాయితాలు అచ్చుకి పంపించాను."

"ఛా!"

నిర్మల లేచింది.

"ఛాకి యాభైయేళ్ళు,నీకు డెభైయేళ్ళు ముసలివాడివి, నీతో నేను మొరపెట్టుకోడ-మేమిటి?" అని.

వొక్క దూకు దూకింది.

"నేను మళ్ళీ వొచ్చేప్పటికి నీ హృదయంమీది బూజునంతా దులుపుకుని. ఆఫీసుని డాన్సుకి సిద్ధం చెయ్యి" అని,

అతని వీపుమీద ఒక్కటి చరిచి పరిగెత్తింది.

ఆ ఉదయం అత నింకేమీ పనిచెయ్యలేదు. ఏ అడుగుల చప్పుడైనా నిర్మలేనని అర్థంలేని ఆత్రుతతో చూస్తున్నాడు. కొంతసేపటికి రాలేదని కోపం కూడా వొచ్చింది. ఎక్కడ తిరుగుతోందో! వెళ్ళి చూస్తే?- ఏమిటి? మరీ మతిపోతోంది! ఏం పుట్టింది తనకి ఇట్లా వేరే ధ్యాసలో పడడానికి?

మధ్యాన్నానికి మరచిపోయినాడు. భోజనం దగ్గిర కూడా నిర్మల కనపళ్ళేదు. ఆమె వుండేవేపుకి సుందరశివరావు వెళ్ళలేదు.

సాయంత్రం కాంగ్రెసు జరుగుతోంది. అన్ని యేర్పాట్లూ చేసి అలిసివొచ్చి, బాలీసుకి జేరబడ్డాడు. నిర్మల మెల్లగా వొచ్చి ఎదురుగా కూచుంది.

"ఆ నల్లటి కాప్టెన్ లేడూ, అతన్ని అడిగాను, పదిమంది వాలంటీర్లని నాకు వొప్పచెప్పమని. ఎందుకో తెలుసునా, హా, హా, హా, వూరినిండా పోస్టర్లు అతికించాలి. ఏం పోస్టర్లంటాడు చూపిస్తే వొప్పుకోడు మరి. కాని నాలో అంత నమ్మకం లేకపోవడమేమటి? అంత జమాను ఉన్నాడా, అంత పిరికి మళ్ళీ అనంకండేం! అసలు ఆ కనకరాజుని చూస్తే నాకు పరమ అసహ్యం! అసహ్యమైనవాళ్ళని వెళ్ళకొట్టడానికి కాంగ్రెసులో నుం......"

"పొద్దున్న ఫిర్యాదు ఏమయింది?"

నిర్మల చేతులు ముకుళించి ధ్యానం చేస్తోంది. అతనూ మాట్టాడకకూచున్నాడు. కళ్ళు మూసుకునే నవ్వుతోంది. వేళ్ళ సందుల నుంచి వెలుగులాగు వొస్తోంది ఆ నవ్వు.

"ఏమిటి?"

"నా ప్రార్థన విన్నాడు!" అంది.

"ఎవరు?"

"నీ శ్రీరాముడు"

"ఓ......"

"నీ కెప్పుడన్నా వరమిచ్చాడా?" అని అడిగింది.

"లేదు."

"నాకిస్తాడు."

"షో."

"ఏం వరం....అనే ప్రశ్న అడగడమే తెలీదు యీ కాప్టెన్‌కి."

"అడిగాను."

"మా నాయకురాలికి గర్భం రావాలని."

"ఎందుకు?"

"వొచ్చే కాంగ్రెసు నాటికి వొస్తే అప్పుడామె రూపం చూడాలని వుంది."

"తప్పు."

"మీకు తప్పు, శ్రీరాముడేగా యీ సృష్టికి కారణం. ఆయనకి తప్పులేదు."

"అదే పని శ్రీరాముడికి."

"మరి భక్తవత్సలుడికి అంతకన్న ఇంక పనేమిటి? మరి వరాలియ్యకపోతే ఎందుకట్లా అక్కడ ఆ పటం? తీసి అవతల పారెయ్యి."

"తప్పు."

"మరి నా వరం యిస్తాడా?"

"ఇయ్యడు."

"లేచింది. పటాన్ని ఒక్కవూపు వూయించింది. అతను ఆమె నాపడానికి చెయ్యి పట్టుకున్నాడు.

"వొదులు నేను నీకోసం మంచి పటం తెచ్చిపెడతా. యిది పారెయ్యనియ్యి. వాడి బొజ్జ చూస్తే నాకు నేత్ర కంటకంగా వుంది. పీడుట, యోధుట్ట! తిండిపోతు-ఒక్క రాక్షసుడు కనబడ్డాడా పరుగెత్తుతాడు...... కాదు కాదు.... పరగెత్తనేలేడు."

అతనితో పెనుగులాడింది. ఆమె రెండు చేతులూ పట్టుకుని ఆపుతున్నాడు. నవ్వుతోంది, జుట్టు రేగింది.

"వుండు, వుండు నువ్వు ఈసారి బైటికి వెళ్ళినప్పుడు...." అంటోంది ఆయాసంతో.

"ఆ పటాన్ని తీశావా-"

కమల వొచ్చి నుంచుంది గుమ్మంలో. నిర్మలని వొదిలేశాడు.

"కమలా, ఈ పటాన్ని తీయించవూ నీ పెనిమిటిచేత!"

కమల మాట్లాడలేదు.

"కమలా, నువ్వతన్ని పట్టుకో నేను లాగేస్తాను."

మాట్లాడలేదు.

"మీ ఇద్దరికీ యేదో తగాదా వున్నట్టుంది తీర్చుకోండి. వొస్తాను" అని వెళ్ళిపోయింది నిర్మల.

కమల మొహం వంక కళ్ళెత్తడానికి సిగ్గుపడ్డాడు అతను.

"అమ్మ వొచ్చింది. ఈ సాయంత్రానికి నన్ను యింటికి రమ్మంటోంది, మా పిన్ని వొచ్చిందట!"

"ఏం! మీ పిన్ని యిక్కడికి రాకూడదా? నువ్వు వెళ్ళడానికి వీల్లేదు. కాంగ్రెసు పనికంటేనా ఈ పిన్నులు!"

"పిన్ని రాదు. పిన్ని మొగుడు రిజిస్ట్రారు మరి. అతనికి మాట వొస్తుందిట!"

"చావమను. పిన్నినీ, మొగుణ్ణీ కలిసి కళింగల్లో పడమను. నువ్వు వెళ్ళడానికి వీల్లేదు"

కమల కన్నీళ్ళతో వెళ్ళిపోయింది.

సాయింత్రం కమలా, అతనూ, నిర్మలా, ఘోష్ సముద్రం దగ్గరికి నడిచి వెళ్ళారు. ఉప్పు కాలవను దాటింతరవాత అతను నిర్మల వేళ్ళను వొదలలేదు. ఘోష్, కమలా బాగా ముందు నడుస్తున్నారు. అతను ఆమె చేయి వొదలబోయినప్పుడు నిర్మల వొదల్లేదు.

దోవలో ఇద్దరు వాలంటీర్లు కనపడ్డారు; అతనికి శాల్యూట్ చేశారు.

"వీరిద్దరూ యీ సాయింత్రం సామాన్ల దగ్గిర వుండవలసినవారు, అవునా, ఇక్కడ వున్నారేం?"

"మిగిలిన వాళ్ళిద్దరూ చూస్తామన్నారండి. అంత పనిలేదు. కనక కొంచెం తిరుగుదామని వొచ్చాం."

"ఇది 'డిసిప్లిన్' భంగం. పదండి వెంటనే నేనూ వొచ్చి విచారిస్తాను" అన్నాడు.

వాళ్ళు కొంచెం దూరం వెళ్ళి అతనికి వినపడేట్టు.

"తమరిట్టా ఆడవాళ్ళతో షికార్లు తిరుగుతున్నారేం?" అన్నారు.

వెంటనే సుందరశివరావు వాళ్ళని వెనక్కి పిలిచాడు.

"నేను మీకుగాదు జవాబు చెప్పవలసింది. నా మాట వినడమే మీ విధి, ప్రశ్నించడం కాదు. ఈమాత్రం 'డిసిప్లిన్' అర్థంచేసుకోలేని మూర్ఖులుండబట్టే మన దేశమిట్లా ఏడుస్తోంది. మిమ్మల్ని వాలంటీర్లుగా చేరమని ఎవరన్నా ప్రాధేయపడ్డారా? వొప్పుకొన్న వాళ్ళు పనిచెయ్యాలి. చెయ్యకపోతే బుద్ధితక్కువయిందని తప్పుకోవాలి. పొండి" అన్నాడు.

వాళ్ళు సిగ్గు మొహాలు వేసుకుని దాటారు. నిర్మల అతని జబ్బని రెండుచేతులతో పట్టుకుని-

"బాగా చేశావు- మీవంటివాళ్ళు పదిమంది వుంటే స్వరాజ్యం వారంరోజుల్లో వొస్తుంది"

"నేను ఒక్కణ్ణి వున్నాగా! పదివారాల్లో రాదూ?"

"నాకు లెక్కలు రావు!"

తననీ, తన మొహాన్నీ, చేతుల్నీ, జుట్టునీ ఆమె కళ్ళు వెతుకుతున్నాయి. సముద్రంలో అంతమయ్యే మైదానమూ, సముద్రపు పిట్టల అరుపులూ, గాలీ, సాయంత్రపు టాకాశమూ, పక్కన తన జబ్బని పట్టుకుని, తనని పూజించే యీ యువతీ-అతని మనసు అక్రమమైన కలత పడుతోందని తట్టింది అతనికి.

వెంటనే ముందు నడుస్తున్న కమలవంక చూశాడు. అతనికి జీవితంలో మొదటిసారి తట్టింది కమల అందమైన పిల్ల అని, ఈ దేశంలో సామాన్యంగా అందరి నిర్భాగ్యులవలెనే అతనుకూడా ఎన్నడూ భార్య అందాన్ని గుర్తించి యెరగడు. కమల యెంతవరకు తన ఆశయాలకి తోడ్పడుతుందా అని యోచించాడు. ఆమె గుణాల్ని ప్రేమిస్తున్నానని తనని చూచి తనే గర్వపడుకున్నాడు. ఆమె శరీరాన్ని సంసారపక్షంగా ఉపయోగించుకున్నాడు. బెంగాల్‌నించి నవ్వులతో, గంతులతో గులాబి అందాలతో, నిర్మల వొచ్చి అతని కళ్ళు తెరిచిందాకా, స్త్రీనీ అందాన్నీ వేరుచేసి అతను చూడలేదు.

కమలవంక చూసి యెంత అందమైనదా అనుకున్నాడు-నిర్మల వంకచూసి యెక్కడ వుంది యీ ఆకర్షణ అని ప్రశ్నించాడు. కాని కమల సౌందర్యంవంక చూస్తే అతని మనసుకేమీ ఆకర్షణ కలగలేదు. పాపం ఆకాశం నీలంవలె, ఉదయకాంతివలె అతనికి అలవాటయింది. ఆ ఆకర్షణ కాలం వృథాగా జారిపోయింది. తన మాటకి విధేయతతో. తన సేవలో శ్రద్ధతో భక్తిగా, ప్రేమగా, తనఛాయ ఐ బతికే కమలకీ, తనని తిప్పలు పెట్టి మెచ్చుకుని, తృణీకరించి, కనపడక, తప్పించుకుని, తటాలున మెరసి, నవ్వి, కోపించి, గంతులువేసే యీ నిర్మలకీ-ఎంత భేదం! అతని హృదయంలో కలిసి గుర్తులేకుండా మాయిమయింది కమల. తన హృదయాన్ని బైటికీడ్చి, మంత్రించి జాడించి, వేధిస్తోంది నిర్మల.

తిరిగి యింటికి వెడుతూవుండగా పటమట మెరిసే బృహస్పతి వంక చూస్తోంది కమల.

"ఎందుకు, కూచున్నంతసేపూ మీవంకేచూస్తుందినిర్మల ?" అంది తటాలున.

"చూస్తేనేం? మనుష్యులవంక చూడకుండా యెట్లా ? కళ్ళు మూసుకోమంటావా?"

"అదేదో విధంగా చూస్తోంది."

"అది నీ మనసులో వికారం, అంతే ఘోషు చూడడూ నీవంక!"

కమలకి కోపం వొచ్చింది మనసులో! వుత్తమాటలతో తప్పించుకోవాలని చూస్తున్నాడు.

"ఒకటేనంటారా? వొద్దంటే ఘోషుతో మాట్లాడను. మీరు నిర్మలతో మాట్లాడ మంతారా?"

"భేధంవుంది. నువ్వు మానేస్తే ఆ నింద నామీదే పడుతుంది. నేను మానడానికి కారణం వుండాలి."

ఆ చూడడంతో ఆగితే బాగుండును."

"మధ్యాన్నం సంగతా అనుమానపడుతున్నావు? ఏమీలేదు, నీ భ్రమ."

"ఏమిటి అంటోంది?" అన్నాడు ఘోష్.

"మధ్యాహ్నం నేనూ, నిర్మల రామపటం కోసం పోట్లాడాము. ఆ సంగతి అడుగుతోంది." అని యింగ్లీషులో చెప్పాడు సుందరశివరావు.

"అవును! ఆ రామపటం ఎందుకు తగిలించావు, అక్కడ?"

"రాముడంటే నాకు భక్తి."

"నీకు ఎందుకు?"

"రాముడు శ్రీమన్నారాయణుడు."

"నారాయణుడి పటమే వుందిగా!"

"కాని ఆదర్శ పురుషుడు కూడా."

"ఎందుకో!"

"అంతానూ."

"ఐనా చెప్పు."

"రాక్షసుల్ని చంపి లోకకంటకం మాన్పాడు. గొప్ప యోధుడు."

"ఎందరు పోలీసులు దొంగల్ని పట్టలేదు. నెపోలియన్, హానిబాల్ మొదలైన యోధులెందరు లేరు!

"మరి తండ్రి ఆజ్ఞప్రకారం ఎవరు 14 ఏళ్ళు దుర్గమారణ్యాలల్లో విహరిస్తారు?"

"తండ్రి అక్రమంగా యిచ్చిన వరాన్ని పాలించడం అవివేకమైన పని. తరువాత నాకు అరణ్యాలంటేభయంగాని, రాముడివంటి యోధుడికి అదొక గొప్పయేముంది? పైగా సేవకి భార్య, తమ్ముడూ, పర్ణశాలలూ.... అదిగాక ఎన్నేళ్ళు రాజ్యం చేసాడు."

"పదహారు వేలేళ్ళు గావును."

"అన్నేళ్ళు రాజ్యంచేసినవాడికి పధ్నాలుగేళ్ళు వనవాసం లెఖ్ఖా- అంటే నీ బతుక్కీ నా బతుక్కీ అర నిముషం అన్నమాట- పెళ్ళాన్నెత్తికెళ్ళినవాడితో తగూలాడ్డం ఒక ఘనతా ! ప్రతివాడూ చేస్తాడు."

"మరి ఏకపత్నీ వ్రతుడే."

"మరి సీతని అడవికి పంపేటప్పుడు ఏమని ఏడుస్తుంది-రాముడికేం, అందరు వుంచుకున్న స్త్రీలలో నే నొకత్తెను-అంటుంది దానికేమంటావు ?"

"అబద్ధం."

"రుజువు చేస్తే పందెం కడతావా? ఇంకో సందేహం-అంత ఆరోగ్యవంతులైన సీతకీ, రాముడికీ ఆ పధ్నాలుగేళ్ళలో పిల్లలు పుట్టలేదేం? పూర్వం కూడా ఏదో బర్త్ కంట్రోల్ వుండేదోయ్."

ఈ కాంగ్రెసులో ఏదో సేవాదీక్ష ఎక్కువతుందనుకున్నాడు గాని, తన కాళ్ళకిందనుంచి భూమే మాయమౌతున్నట్టుంది అతని ప్రాణానికి. ఈ ఆడవాళ్ళముందర ఇట్లాంటి సంగతులు మాట్లాడతాడేమిటి."

"దేశంకోసం భార్యనుకూడా త్యాగం చేశాడే! అతను ఆదర్శంకాదా !"

నిజంగా దేశంమీద ప్రేమవుంటే అనేక భార్యలకు వందలకొలది తనవంటి యోధుల్ని కనాలి. ఈ దేశసేవకులందరూ నేర్చుకోవాలి అది. వీలైనచోటల్లా వందలకొలది పిల్లల్ని కని యోధుల్ని తయారుచెయ్యాలి. ఈ భీరులందరూ పందులవలె అనామకుల్ని కని ఎందుకు దేశభారంవృద్ధి చెయ్యడం? శ్రీరాముడే ప్రజల కోరిక ప్రకారం వర్తించే వాడైతే మరి ప్రజలందరూ రాజ్యం చేయమంటోవుంటే అడవికి పోయినాడేం? అక్కడ తండ్రి ఆజ్ఞ పాటించాలి. ఇక్కడ భార్య గనక ప్రజలు అడక్కముందే నిప్పులో దూకించాలి. కడుపుతో వుంటే తన పనికి అడ్డమని అడవికి పంపించాలి! ఇదే స్త్రీల కిచ్చిన గౌరవం ఈ దేశంలో! ప్రజలకోసం త్యాగం చేశాట్ట! ఎవరు త్యాగం చేసినా ముందు భార్య కనబడుతుంది. ఆ ఆదర్శం పెట్టుకొని భార్యచేత ప్రతివాడికీ చాకిరీ చేయిస్తారు-తండ్రికి, తల్లికి, అన్నలకి, అక్కలకి, అతిధికి-అంత భక్తి వుంటే తను చేసుకోవాలి; భార్య యెందుకు?"

"మరి మన కాంగ్రెసు శిబిరంలో స్త్రీలకు స్వేచ్ఛలేదూ?"

"ఈ వేడిలో అంతేలే! చూడు ఈ రాజకీయ వుధృతం తగ్గగానే మళ్ళీ గూళ్ళల్లో దాచుకుంటారు. ఈ ఆడవాళ్ళు మాత్రం-నలుగురూ హర్షిస్తున్నారు గనుక తయారై వొచ్చారు- కీర్తికోసం.... వీళ్ళకి మాత్రం నిజమైన స్వేచ్ఛ కావాలనుకున్నావా? స్వేచ్ఛ యిచ్చే సుఖం కావాలి.... బాధ్యతకాదు. కమలను నేను కలకత్తా పిలుస్తాననుకో, కమల వొస్తానంటుంది నువ్వు లేకుండా. ఏమంటావు నువ్వు? అదే రకం అందరూ! కమల యేమంటుంది? ఇంకే ఆడవాళ్ళు వొస్తారంటుంది. అందరూ అంతే!"

రాత్రి పడుకున్నప్పుడు-సముద్రంవొడ్డున నిర్మల పాడినపాటా, ఆమె డాన్సు చేసినప్పుడు కదిలిన చిన్నరొమ్ము సన్నని నడుమూ, నవ్వే కళ్ళూ అతని నిద్రని భంగపరిచాయి.

అతని దేశవ్రతాదర్శమూ, ఏకపత్నీ వ్రతమూ మనసుని కుట్టాయి. కాని శ్రీరాముడు అంతదీప్తితో గోచరించలేదు కమల తనవలె పరపురుషుడితో సంచరిస్తే తనకెట్లా వుంటుందీ? ఆ నిర్మల ఉద్దేశ్యమేమిటి ? ఆమెతో అంత చనువుగా వుండడం తన ఆదర్శాలకూ, స్వభావానికీ తగిన పనికాదు. ఇట్లా స్త్రీల చూపులచేత చలించేమనిషి తానేం దేశ సేవ

చెయ్యగలడు? కాని, ఆమె పెదవులు-ఒక్కసారి ముద్దు పెట్టుకోగలిగితే! ఆమెకూడా యిష్టపడేటట్టే వుంది. ఒక్కసారి ఆ ఆనందాన్ని పొంది, ఇంక స్త్రీని వర్జిస్తే సరి! కాని ధర్మమా? కమల యెడల న్యాయమా ? కాని కమలాతొనవంటి ఆ పెదిమ, ఆ చిన్న లేతరొమ్ము, చురుకుగా గంతులువేసే ఆ కాళ్ళు, తన అరిచేతిలో గిలగిలలాడిన ఆ వేళ్ళు-

మర్నాడు సాయంత్రం అతన్ని యువకులు ఉపన్యాసమిమ్మన్నారు. దేశ సేవని గురించీ, దీక్షా, త్యాగమూ, అగ్ని కురిపించాడు. యువకులలో స్వార్థపరత్వాన్ని, ప్రమత్తతనూ అతని మాటలు చీల్చి చూపించాయి. అంతసేపూ నిర్మల కళ్ళు అతని ముఖం చుట్టూ, మెడ, భుజాలు తాకుతో, భక్తితో, సంతోషంతో, భయంతో తిరుగుతున్నట్టు తెలుస్తోనే వుంది.

తనని అభినందించే ప్రజలు వొదలగానే కమలవంక తిరిగి-

"ఎట్లా వుంది?" అన్నాడు.

నిర్మల భక్తికన్న తన సహధర్మచారిణి కమల మెచ్చుకోవాలి. తన జీవితమంతా ఘనకార్యాలకి పురికొల్పాలి.

"బాగానే వుంది."

ఉపన్యాస తీవ్రతలో వేడెక్కిన అతని రక్తం ఒక్కసారి పది డిగ్రీలు జారింది. వూరు కున్నాడు. మళ్ళీ రాత్రి భోజనమైన తరవాతగాని కమలతో మాట్లాడేందుకు సమయం చిక్కలేదు. ఈ లోపున తన బాధని తరిచి చూచుకుని కమలని ప్రశ్నించాలనుకున్నాడు.

"ఎందుకు, 'బాగానే వుంది' అన్నావు?"

"నన్నడిగారుగా!"

"లేదు. విన్నవాళ్ళందరూ-మళ్ళీ భోజనం దగ్గిర, నాయకులు కూడా-నేను మాట్లాడిన పద్ధతి అద్భుతంగా వుందన్నారు....."

"నేను బావుండలేదన్నానా? కాని నాకు మాత్రం అంతా వుత్త మాటల్లాగు కనపడ్డది. అట్లా మాట్టాడంకన్న ఏదన్నా పనిచేస్తే బావుండుననిపించింది."

"ఏం పని? చెయ్యడంలేదా?"

"ఈ కాస్తకేనా అంత వుపన్యాసం! ఏదో జీవితమంతా త్యాగంచేసి, ఎన్నో ఏళ్ళు బాధలలో గదిపినవాళ్ళు మాట్లాడాలి. మీరు సుఖంగా భోజనంచేసి కూచుని ఆ త్యాగాలు మాటలాడడం నాకేమీ బాగాలేదు."

"మరి యేం చెయ్యను? త్యాగాల అవసరం రానీ."

"అప్పుడు మాట్టాడండి. అవసరమొచ్చి త్యాగంచేసి-అప్పుడూ యీ ఉపన్యాసాలు, యిప్పుడే యెందుకు?"

"మరి నిర్మల యేమంది-యీ సాయంత్రం-'ఈ ముసలివాళ్ళందరూ గొప్ప నాయకుల మనేవాళ్ళు. ఎంతోకాలంనించి ఉపన్యాసాలు అలవాటైనవాళ్ళూ కూడా నీమల్లే నిప్పులు కురిపించలేదు. నీవు నిలువునా అగ్నే!'' అంది.

"మరి యితరులని పురికొల్పకుండా ఒక కార్యం కాదా?"

"మాటలతో ఎవరికీ పురెక్కదు."

కమల తనని అన్యాయం చేస్తోందని అతనికి తోచింది తన ఘనతని గుర్తించని భార్య! తనమీద యేమైనా భక్తి వుందా యీ కమలకి!

"చూడండి, రండి వెన్నెలవంక చూద్దాము."

మారుపలక్కుండా కండువా వేసుకుని ఒక్కడూ రైలు కట్టకేసిపోయినాడు.

తిరిగి వొస్తోవుంటే చాలామంది యువకులూ, స్త్రీలూ వెన్నెల్లో యిసికలో ఆటలాడు కుంటున్నారు.

నిర్మల అతన్ని చూడగానే పరిగెత్తుతో వొచ్చింది.

వెనక ఎవరో పిలుస్తున్నారు.

"నిర్మలా, వెడుతున్నావేం?" అన్నారు యెవరో.

"నా సుందర్ వొచ్చాడు. నేనింక రాను."

ఏమనుకుంటారు వాళ్ళు? కమల తనవంకన్నా చూడకుండా ఆడుకుంటోంది. ఇంకా కోపమే గావును.

"ఏమైనావు నువ్వు? అందర్నీ వెతికాను నీ ముఖం కోసం."

అతని జబ్బని రెండు చేతులతోనూ పట్టుకుంది.

"చూడు, యీ యవ్వన రక్తాన్నంతా చూడు. ఈనాడు యిట్లా ఆడుతున్నారు రేపు దేశం కోసం బలి ఔతారు, నువ్వు నాయకుడివై...."

"నాయుకుణ్ణీ కావొద్దు, ఏమీ వొద్దు. నన్ను బలికానీ...."

"నాతో సహా-"

"రా."

అంతే కావాలి కమలకి! తనని నిర్లక్ష్యం చేస్తే తనకి మాత్రం ఏం లక్ష్యం? నిర్మలతో దూరంగా నడిచి వెళ్ళాడు. చప్పున నిర్మల,

"ఆ యిసికమీంచి జారదాం. ఎవరు ముందరో పైకి..."

సగం పరిగెత్తి అతని మెడపట్టుకుని వేళ్ళాడింది ఆయాసంతో.

అర్థమేమిటి? ఇంత చనువుగా వుండడం వాళ్ళ దేశాచారమా, లేక-

ఈమె బ్రహ్మసమాజపు పిల్ల....వాళ్ళలో స్త్రీలు స్వేచ్ఛగా వుంటారు. అందువల్లనేమో!

ఇసికలోంచి కిందికి దొర్లుతోవుంటే....ఆ నవ్వే బుగ్గలు, గట్టిజాకెట్, ఆ చక్కని బుజాలు, ఆ గంతులు, నవ్వు-

"చూడు.... వాళ్ళందరూ ఒకచోట కూచుని ముసలివాళ్ళమల్లే కబుర్లు చెప్పుకుంటారు. ఈ శిబిరానికల్లా......నువ్వూ నేనే పిల్లలం-ఆడుకుందాం-"

"ఆటేనా! అవునా, కాదా?

"నిర్మలా!"

ఆగి ముఖమెత్తి చూచింది. అతని కంఠస్వరంలోని అర్థం గుర్తించినట్టుంది. మొగపిట్ట అర్థం గ్రహించి ఆయత్తపడే ఆడపిట్టవలె చూస్తో నుంచుంది.

ముద్దు పెట్టుకుంటే.....

అదీ ఆటే అనుకుంటే-

ఆమె కళ్ళల్లోకి చూస్తో నుంచున్నాడు. ఆమె నిర్భయంగా చూస్తోంది. అతనేమీ చెయ్యలేదు. అతని దీక్షా, అనుభవరాహిత్యమూ, విద్యా అన్నీ అడ్డుపడ్డాయి. పరిగెత్తుతో వచ్చి గుంపుని కలుసుకున్నారు ఇసికతో, నవ్వుతో నిండిన కళ్ళతో....

కమల మర్నాడు ఏమీ సంతోషంగా అతనితో మాట్లాడనే లేదు.

ఘోష్ అతని శ్రీరాముణ్ని వేటాడి చంపనిశ్చయించుకున్నాడు.

"అసలు శ్రీరాముడున్నాడా?"

"లేడంటారా?"

"నేను వున్నాడూ అనను, లేడూ అనను. ఉన్నాడని రూఢిగా అన్నవాళ్ళతోనే వాదన. ఉన్నాడని యేమిటి ప్రమాణము?"

"రామాయణము."

"ఆ ప్రకారం... 'ఇలియాడ్' ప్రమాణంగా 'ఎఖిలిస్' మొదలైన వాళ్ళున్నారా?"

"ఆ, వుండవొచ్చు."

"జీయస్, మొదలైన దేవతలూ....."

"ఆ...."

"అంటే ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క స్వర్గమూ, వేరే దేవతలూ, వున్నారా?"

"అదెట్లా?"

"ఈనాడు నేను పురాణం వ్రాస్తే ఇంక వెయ్యేళ్ళకి దాంట్లో నేను రాసిన మనుషులూ, రాక్షసులూ ఈనాడు వున్నారనీ ఆనాటివాళ్ళు అనుకుంటారు."

"మరి రామాయణం నిలవలేదా యిన్ని యుగాలు-"

"దాని సౌందర్యంవల్లా, మనుషుల మూర్ఖంవల్లా నిలిచింది. కవి ఆలోచించి రాసినవన్నీ నిజమంటే...."

శ్రీరాముడు తనని అన్యాయంచేశాడు, అంతకన్నా 'గట్టిగా' వాదానికి నిలవక. రాముడు-తనని సిగ్గుపాలు చేస్తున్నాడు.

మర్నాడు ప్రొద్దున్నే అతను పనులలో వుండగా నిర్మల వచ్చింది. అతని చేతివంకా, కలంవంకా చూస్తో మాట్లాడకుండా నుంచుంది. అతను కొంచం తల యెత్తాడా గడగడా వాగుతుంది. కాంగ్రెసు నాయకుల నడకా, మాటలూ అనుకరిస్తుంది. అతను రాసుకుంటున్నాడన్న మాటే కాని, అంతసేపూ అతని మనసంతా ఆమెమీదా, అతని కాలుకి తగులుతున్న కుచ్చెళ్ళ జరీ అంచుమీదా, బ్రోచిలో గుచ్చుకున్న మరువం కొమ్మమీదనే వుంది. చప్పున ఆలోచించకుండా.....

"విడవలేనంత మోహం కలుగుతుందనుకో ఏం చేస్తావు?"

"ఆ-"

చాలా అనేశాడు. మార్చాలి.

"ఎవరన్నా ఒకమ్మాయికి, ఒకాయనమీద మోహం కలిగితే...."

"పెళ్ళి చేసుకుంటుంది."

"ఆయనకి పెళ్ళాముంటే...."

"తప్పు. అట్లా మోహించడం చాలా తప్పు. పరదేశాల ఆచారాన్ని మనం అనుకరించ కూడదు. అందులో ఆ భార్యని అన్యాయం చేయడం చాలా దుర్మార్గం.... పైగా తనతోటి స్నేహితురాలైనప్పుడు.... ఏం, అతడుగాక యింక ప్రేమించటానికి ఎవరూ లేరా?"

"మరి యిట్లా ఆడుతో, నవ్వుతోంటే మొహం కలగదా?"

"కలిగినప్పుడు దాచుకోవాలి, అందుకు అసాధ్యమైతే ఆ మోహాన్ని నాశనం చెయ్యాలి. ఏం లాభం మోహించి!"

వెళ్ళిపోయింది.

కాని వెడుతో ఎంత ప్రేమగా తనవంకచూసిందా అనుకున్నాడు.

కమల మొహంవంక చూడడం సిగ్గుగావుంది. తానేమీ చెయ్యకపోయినా అతని హృదయంలోని రహస్య వాంఛ అతన్ని - నేరస్తుణ్ని చేస్తోంది.

అతని దీక్షలమీద భక్తిపోయింది. నిర్మల తనవెంట తిరిగినంత సేపూ, అధర్మమని తప్పించుకోవాలని చూశాడు. ఇంతకీ నిర్మల తనతో ఆడుతోందిగాని, అంతకన్న దేనికీ

సంసిద్ధురాలుకాదు. ఆమె కావాలి తనకి. ఆ నవ్వును తన పెదవులతో అనుభవించాలి, ఆ పరుగును, గంతులను తన చేతులలో లీనం చేసుకోవాలి.

రాజాగారి బంగళాలో టీపార్టీకి వెళ్ళాను. కమల రాలేదు.

"నిర్మలా, యిట్టారా- నీకో సంగతి చెపుతాను."

ఇద్దరూ అందరికీ దూరంగా పున్నాగ చెట్టుకింద నుంచున్నారు. నిర్మల అందికదా-

"చూడు-అందరూ అట్లా కూచుని, ఆ పదార్థాల నన్నిటినీ నోట్లోకి తీసుకుంటోవుంటే చూడ్డం యెట్లావుంటుంది? ఎప్పుడన్నా యోచించావా? చూడు, ఆ ఆచారి దూరాన్నించి పళ్ళెంతో వస్తోవుంటేనే పిల్లి పిచికని చూసినట్టు ఎట్లా చూస్తున్నాడో! అంతా తిండి, తిండి? ఒకర్నొకరు చూడరు- మాట్లాడరు.... ఏదో ఆ తిండిలో మధ్య ఒక పలుకు. ఈ ఉచితంగా వచ్చే యీ పదార్థాలన్నీ మనం యెంత సొమ్ము చెయ్యగలమా అనే ధ్యాస!

"ఇంకా ఆకలి లేదే" అని దుఃఖ్కం, పదార్థాలు అందకపోతే దుఃఖ్కం, రెండూ సరిపోవాలి.

"మనం మనషులం కాదనుకో, ఈ మనుష్య జాతివంక ఎక్కణ్ణించో ఒచ్చి చూస్తున్నా మనుకో, మనకి ఆకలి దప్పులు లేనివాళ్ళమనుకో, ఏమనుకుంటాం? ఈ బిళ్ళల్ని, ఈ వుండల్ని వీళ్ళెందుకిట్లా లోపలికి ఎక్కించుకుంటున్నారా అనుకుంటాం- పడవ దోనెలో బస్తా లెక్కించినట్టు జేబులు పట్టక శరీరంలోపల వేసుకుని తీసుకుపోతున్నారునుకుంటాను.

"చూడు ఆ పిల్లని యెట్లా ప్రోత్సహపరుస్తున్నాడో ఆ తండ్రి-వూరికే ఒచ్చింది బాగా తినమని-"

"ఇంకా చూడలేను, రా-"

వాళ్ళిద్దరూ బంగళా వెనక్కి నడిచి వెళ్ళారు.

"తమాషాగా ఆలోచిస్తావే!"

"అంతేకాదు. అనుకుంటానుకదా- ఆ పదార్థాలు ఎక్కణ్ణించి వొచ్చాయి-సాయంత్ర మప్పుడు చల్లగాలిలో పడుకున్న శనగ చేలు, గడ్డిని మేసి గంభీరంగా యింటివేపు నడిచే ఆవులు. యెర్రగా పచ్చని ఆకుల్లో వేళ్ళాడే మిరపపళ్ళు, సముద్రపు పెద్ద అలలు, అన్నీ అన్నీ యీ నోళ్ళలోకి దూరేందుకు పదార్థాలనీ తయారు చేస్తున్నాయని-"

"గులాబీ పువ్వుని చూస్తే దాని వాసన-పన్నీరై మిఠాయిలోకలసి టీపార్టీ వాడి గొంతులో దూరుతుంది- వందలకొలది పువ్వుల్ని నలిపి సారంతీసి వీళ్ళ గొంతుల్లో పోసేందుకా!

"కాశ్మీరదేశపు కుంకుమపువ్వు, మైసూరు జాజికాయ, మళయాళపు లవంగం- ఆ వాసనలు- ఆ తోటలు- వాటిని పండించే ఆ కర్షకులు- అందరూ వీళ్ళు అట్లా తిని అజీర్ణాలు తెచ్చుకునేందుకా, రాత్రింబవళ్ళు పనిచేస్తున్నారు? అంతేకాక పువ్వు పువ్వుకీ

ఎగిరే తేనేటీగ పువ్వుల్ని కాయలు చేస్తోంది పాపం- వీళ్ళ నోళ్ళకోసం సమస్తమూ తన వుష్ణంతో పండించే సూర్యుడు."

"ఇంక చెప్పకు నాకు ఒళ్ళు మండిపోతోంది. నేను వెళ్ళి నువ్వు చెప్పిన లెక్చరంతా చెప్పి ఓ కర్ర తీసుకు వాళ్ళమీద పడితే యేమంటారో" అంటున్నాడు. గాని అతని దృష్టి అంతా ఆమె నడకమీదా, ముళ్ళు తప్పించుకోడానికి వొంగే ఆమె అందంమీదా వుంది. దోవ చిన్నదై దగ్గిరిగా వొచ్చినప్పుడు ఆమె చెరుగు తగులుతుందేమోనని ఆశపడ్డాడు. ఆ తోటా సాయంత్రమూ, గడ్డిలో పువ్వులూ, పురుగులూ లోకాన్ని కొత్త తోపిస్తున్నాయి.

"ఇట్లా కూచుందాము, ఒక్కరవ్వసేపు, వాళ్ళ ఉదరాలు నింపుకున్నంతసేపూ....."

అని కస్తూరి తుమ్మకింద పచ్చికమీద కూచున్నారు.

"ఏం తింటే యింత ఆనందం కలుగుతుంది! ఈ పచ్చికా, ఆకాశమూ, ఆ తేనేపిట్ట కూతలూ, యీ గాలి నిశ్శబ్దం-" అంది.

"నా పక్కన నువ్వూ-" అన్నాడు.

మాట్లాడలేదు. ఆమె మెల్లిగా తలెత్తి-

"నాకు దిగులు వేస్తోంది, ఎందుకో! ఇంట్లాంటిచోట్ల పొందే నిర్మలమైన ఆనందంలో దిగులు కూడా కలిసే వుంటుంది. ఎందుకాఅనియోచిస్తాననుకో. ఒకప్పుడు ఇదంతా వొదిలిపోవలసిందే కదా!"

"వుండు యీ వూళ్ళోనే, చాలాసార్లు వొద్దాము ఇక్కడికి."

అర్థం కానట్టు చూసింది అతనివంక.

"అది కాదు, మనం యీ లోకాన్ని వొదిలినప్పుడు ఇంత ఆందమైన లోకమే వొదిలి పోవాలికదా!" అంది.

"ఇంకా అంతకన్నా అందమైన లోకాలు ఎన్ని వున్నాయో!"

"ఏమో!"

"మరి మీ బ్రహ్మసమాజంలో ఏం నమ్ముతారు?"

"మతం అట్లా వుండనీ. మనకి నిశ్చయమేమిటి! నిశ్చయమైన, చనువైన యీ ప్రదేశాల నన్నిటినీ వొదిలి పోవాలే అనీ-అదే కాదు-ఆ దిగులు ఎట్లా ఎందుకు వస్తుందో తెలీదు ఇప్పుడూ అంతే-నువ్వూ యీ అందమూ నాకింకేం కావాలి? కాని దిగులు-"

"ఐతే పోదాము."

"వొద్దు. ఆ దిగులు యెంతో మధురమైనది."

మాట్లాడలేదు. చప్పున అతని చెయ్యి పట్టుకుని-

"చూడు" అంది రహస్యం చూసినట్టు. పడమట సూర్యుడు అస్తమిస్తో నల్లని మబ్బు వెనకనుంచి తోకచుక్కవలె కిరణజాలాన్ని తూర్పువేపు చిమ్ముతున్నాడు.

నిర్మల వూపిరి బిగబట్టి చూస్తోంది. ఆమె మెరిసే కళ్ళూ, ఎత్తిన తల వెనక జాకెట్టుమీద పడుతున్న జుట్టూ, గడ్డినానుకున్న ఆమె చెయ్యీ అన్నీ ఆ తెల్లని కాంతిలో తడిసి, అతన్ని అనేక విధాల బాధపెడుతున్నాయి.

"నువ్వు మీదేశం వెళ్ళకు.'

"వెళ్ళక."

"ఇక్కడ వుండు-మనిద్దరమూ"

తరవాత ఏమిటో అతనికి తెలీదు. ఆమె చూస్తోంది అతనివంక ఏమి చెపుతాడాని....

"నువ్వు వుంటే-నేను-నీనించీ, నీ కళ్ళ చూపుతో నాలో ప్రవేశించే శక్తితో, ఈ దేశాన్ని - ఈ ప్రజలతో యెంతో ఉత్సాహాన్ని పురిగొల్పనా అనిపిస్తుంది. నువ్వు వెళ్ళకు. నువ్వు నాకు, ఈ దేశానికి, ఈ ప్రజలకు నీ అవసరముంది. నీ మూలాన్న నేనెంత తీవ్రసేవను చూప గలనో నీకే అర్థమౌతుంది."

మాట్లాడలేదు.

"వెళ్ళనను."

"వెళ్ళను."

"ఇదే వాగ్దత్తం. ఈరోజుతో మనిద్దరి జీవితాలూ ఏకమైనాయి. ఇంక మనిద్దరికి బేధంలేదు. భారతమాతముందు, దేశసేవా దీక్షను తీసుకుంటున్నాము. మనిద్దరికీ ఇంక భేదంలేదు."

చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

ఇంక ప్రతిదినమూ, ప్రతిసాయంత్రమూ, నెలలు, సంవత్సరాలు, ఆమె కోమ -లత్వంతో, ఆమె జుట్టు మృదుత్వంతో, ఆమె మెత్తని మాటలతో, తాను పొందగల ఆనందాన్ని, సాహసాన్ని, తలుచుకుని ప్రమత్తుడైనాడు. కొత్తగా మంచి 'వైను' తాగినవాడివలె ఉద్రేకవంతుడై నాడు. ఆమె చేతిని పట్టుకుని దగ్గిరగా లాక్కుని అతన్ని ప్రశ్నించే పెదవుల్ని ముద్దుపెట్టుకుంటున్నాడు. ఆ సాయంత్రం చీకట్లో ఒకరి నొకరు ఆనుకుని వాళ్ళు సమస్తమూ మరిచారు.

మెల్లిగా నిర్మల.

"కమల-" అంది.

"కమల-కమల- నా భార్య! దాని కీ దేశత్యాగం అర్థంకాదు నువ్వు, నువ్వు- నా దేవతవు - నా సోదరివి - మనప్రేమ నిర్మలము!" అన్నాడు.

ఆమెని కావిలించుకున్న నిముషంనించి, అతనిమనసు బాధిస్తోనేవుంది. ఏకపత్నీ వ్రతమూ, కమలమీద ప్రేమా, కమలయెడల విశ్వాసమూ అన్నీ గిలగిలలాడుతున్నాయి అతని ముందు-నిర్మల అన్నమాట అతని యోచనల్ని అందుకుని అతని సందేహాలకే ప్రత్యుత్తరాల్ని కల్పించింది. అవును, నిర్మలను కావిలించుకోడం పవిత్రం. దేహాలమీద కామంకాదు. ఆత్మ సంయోగానికి చిహ్నము. ఆమె సోదరి. ఇంక భయములేదు. అర్థమయింది. అతని వాంఛ ఇదంతా దేశసోదరిమీది ప్రేమ అంతే! ఇంక అతనికి భయంపోయింది. సందేహం పోయింది. ఏమీ సంకోచం లేకుండా ఆమె ముఖాన్ని ఎన్నోసార్లు ముద్దుపెట్టుకున్నాడు. సంతోషంతో ఆమె అతని చేతుల్లో వొణికింది.

వీళ్ళు వెళ్ళేటప్పటికి టీపార్టీ అయిపోయింది. నౌకర్లు తప్ప యెవరూలేరు. శిబిరానికి వొచ్చేటప్పటికి ఘోష్ కోపంతో "ఏమైనారు మీరు? ఎక్కడా కనపళ్ళేదు" అన్నాడు.

"అట్లా తిరుగుతున్నాము."

"ఏమిటి ఒక్కత్తె నీ, ఆడపిల్లని తీసుకుని రాత్రి తిరుగుతున్నావా? నీకు బుద్ధిలేదూ?"

"ఆత్మలు ఏకమైనాయి... దేశసేవలో...."

ఇల్లాటివేవో అనబోయి "ఇప్పుడతని కర్థంకాదు. ఆ కోపం తగ్గితేనేగాని" అనుకుని ఇప్పుడేమనాలా అని ఆలోచిస్తున్నాడు. నిర్మల ఏమో దూకుడుగా బెంగాలిలో అంటోంది. హిందీ తెలిసిన అతనికి 'నీకెందుకు నా సంగతీ? నీ పని నువ్వు చూసుకో నా మీద అధికారంచేస్తే జాగ్రత్త' అన్నట్టుంది.

అతని చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళింది. ఆమె ధైర్యం తనకి లేకపోయింది కదా అని సిగ్గుపడ్డాడు.

ఆ రాత్రినించి నిర్మల సంగతి తలచుకున్నప్పుడల్లా ఒళ్ళు పులకరించింది! జీవితంలో కొత్త ఉత్సాహమూ, వెలుగూ కనపడ్డది. నూతన జ్ఞానేంద్రియం ఒకటి తెరుచుకున్నట్టయింది. నిర్మల తన సోదరి, తన మిత్రురాలు. తనకి నవోత్సాహమిచ్చే శక్తి-ఇంకేం కావాలి. ప్రతిపనీ సహజమైన గానంతో కూడినట్టు తోచింది. కాని కమలతో మాట్టాడేప్పుడూ, ఆమె తనదగ్గరికి వొస్తేనే యేదో భయమూ, కాపట్యమూ తోస్తున్నాయి. ఎందుకంత బాధ? తానేమి చేసినట్టు? తన కొత్త సంతోషాన్ని కమలకు చెప్పాలనిపించింది. కానీ ఏ మాటలతో చెప్పాలో తెలీదు. నాలుగైదుసార్లు ప్రయత్నించి వూరుకున్నాడు.

ఎట్లా చెప్పినా ఆమెకి అర్థంకాదు. ఎందుకర్థం కాకపోవాలి? కమలకి తనని అర్థంచేసుకునేటంత ఔదార్యమూ, ఔన్నత్యమూ లేవు అని సమాధానం చెప్పుకున్నాడు. ఎంత సన్నిహితులైనా ఒకరిభావాలు యింకోకరికి తెలియచెయ్యడం ఎంత కష్టం! భాషాలోపమా? లేక సానుభూతి లోపమా?

పగలంతా పనిలో వూపిరాడలేదు. ఎప్పుడు సాయంత్రమవుతుందా, నిర్మలని చూద్దామా అనుకుంటున్నాడు. వెన్నెల వొస్తుంది. తానూ, నిర్మలా, నిర్మలకూడా పగలంతా

తనని తలుచుకుని ఆత్రుతపడుతూ వుండాలి. కమలని తప్పించుకోవాలి. రెండుసార్లు ఆ పక్కనించి వెళుతూ చిరునవ్వు నవ్వింది. కాని లోపలికి రాదేమో! తన పని తొందరని చూసివుంటుంది; పోనీ తనే పనిని ఆపి వెడితే! కాని ఆ వొక్కరవ్వ మాట్లాడించి ఏంలాభం? అంతకన్నా ఆమెనే రానీ, తానెందుకు వెళ్ళాలి.

సాయంత్రం బైట చాప వేసుకుని కూచున్నాడు.

కమల మాట్టాడుతోంది. నిర్మల పత్తాలేదు. నిర్మల సంగతి కమల నడగాలనివుంది, కాని ధైర్యంలేదు. ఎందుకు అడగకూడదు? తప్పేముంది?

నిర్మల ఏనిమిషాన్నైనా రావచ్చు. అప్పుడింక ముగ్గురూతప్పరు. కమల వుంటేనేం? నిర్మలా తానూ దగ్గిరిగా కూచోకూడదా? చేతులు పట్టుకోకూడదా? తనకో చెల్లెలు వుంటే అట్లా కూచోదా? బుజంమీద మాత్రం చెయ్యి వెయ్యదా? ఒకవేళ కమల ఎక్కడికన్నా వెడితే!

నిర్మల రాలేదు.

"నిన్న లెక్చరులో ఆ సింగుగారు ఎవరు, పొట్టిగా లేడూ పంజాబీ-అతనేమన్నాడంటే....."

"అబ్బా, చావనిద్దూ! వాళ్ళసంగతి పోనీ."

"ఎందుకు చిరాగ్గా వున్నారు?"

"ఎక్కడన్నా తిరిగి వొస్తాను" అని.

లేచి వెళ్ళిపోయినాడు. నిర్మల ఏమయింది? ఎందుకా ఉద్యోగం? తొరతొరగా ఆమెవుండే చోట్లన్నీ తిరిగాడు చివరికి తాటితోపు వెనక ఇసికలో ఘోషుతో మాట్లాడుతూ కూచుంది. శివరావుకి చాలకోపంవొచ్చింది. కాళ్ళు వొణికాయి. పెదవులార్చుకుపోయినాయి. నిర్మలని చాలా బాధించాలనిపించింది. తిరిగి వెళ్ళిపోయినాడు.

కాని తను వెళ్ళింతరువాత వాళ్ళను వొంటరిగా ఆ యిసికలో, ఆ చల్లని గాలిలో, నిర్మల జుట్టులో అతని వేళ్ళు..... ఆమె బుజాలమీద అతని బుజాలు....

రోజు తనే చూస్తున్నాడా వాళ్ళు కలుసుకోకుండా? వారంకిందట తనెక్కడ వున్నాడు.

పాపం నమ్మి ఆ తలిదండ్రులు ఆ పిల్లనిట్లా, పంపితే వొంటరిగా పవిత్రమైన దేశసేవకై, ఈ కుచ్చితుడు, ఈ పాపి, యీ దేశద్రోహి ఆమె మనసుని నెమ్మదిగా కృత్రిమమార్గాలమీద తిప్పుతున్నాడు. ఏవో మాటలు చెబుతున్నాడు. వెనక్కి వెళ్ళాడు. బహుశా, ఇంక తనతో మాటాడవొద్దని బోధిస్తోవుంటాడు. ఆమె తల్లిదండ్రులతో చెపుతానని బెదిరిస్తోంటాడు.

"ఎక్కడికో షికారు వెడుతున్నారే!" అన్నాడు ఘోష్

నిర్మల చిరునవ్వునవ్వి వూరుకుంది.

అతను సిగ్గూ, బిడియమూ విడిచి కూలబడ్డాడు వాళ్ళదగ్గిర.

వాళ్ళిద్దరూ ఒక్కమాట మాట్లాడలేదు. ముగ్గురూ మొద్దుల్లాగు కూచున్నారు. తొమ్మిదయింది. చీకట్లో ఘోష్ సిగరెట్టు వెలుగు కనపడుతోంది. చీకట్లో నవ్వుకుంటున్నారా? వాళ్ళచేతులు తాకుతున్నాయా?

అందరికీ ఆకళ్ళు వేశాయి గావును ఒక్కమాట మాట్లాడకుండా లేచి శిబిరానికి పోయినారు.

శివరావు ఇంక నిర్మలమొహం చూడకూడదని నిశ్చయించుకున్నాడు. తనని పలకరించినా పలకకూడదు. ఇట్లాంటివాళ్ళను నమ్మితే అధోగతి తప్పదు. భోజనం పాక దగ్గిరికి వెడుతూవుండగా నిర్మల పరుగెత్తుకొని వొచ్చింది.

"అబ్బా! దేవుడిమల్లే వొచ్చావు. ఎవడితో మాట్లాడదామన్నా 'ప్రేమా, కామమూ' అనేవాడూ, చేతులూ, భుజాలూ తాకించాలని చూసేవాడేగాని, నిర్మలంగా, స్నేహంగా మాట్లాడేవాడు ఒక్కడూలేడు, వున్నతమైన యోచనలే లేవు ఎవడికీ! నువ్వు వొచ్చినా పోడే!" అంది.

సుందరశివరావుకి కోపమంతా పోయింది.

"మళ్ళీ మనం కలుసుకోడ మెప్పుడు....."

"రేపు." అని,

అతని చేతిని గట్టిగా పట్టుకుని కళ్ళల్లోకి నవ్వి వెళ్ళిపోయింది.

మర్నాడంతా అతని గదిలోనే వుంది నిర్మల. కాని అంతకాలం యెవరో ఒకరు అతనితో మాట్టాడుతూనే వున్నారు. మధ్యాహ్నం వూపిరాకుండా లెక్కలు చూస్తున్నాడు-చప్పున నిర్మల వొచ్చి నుంచుని "కాలేదా, లెక్కలు!" అంటోంది.

ఆమె చెయ్యి పట్టుకుని కిందికిలాగి ఆమె అల్లరంతా పోయ్యేట్టు ముఖమంతా ముద్దు పెట్టు కున్నాడు- చప్పున వొదిలాడు ఏమంటుంది? అరుస్తుందో, కొడుతుందో, ఉమ్మేస్తుందో!

"తప్పుకాదా?" అంది మెల్లిగా.

గుండె నిబ్బరపడి అప్పుడే భయపడి యెందుకు వొదిలానా అని దిగులుపడి, ఆమెవేపు చెయ్యి జాస్తే దూరంగా జరిగింది.

"వొద్దు-ఇప్పుడు వొద్దు-అట్లా చూస్తారెందుకు? నేనేమీ అనుకోను-మీ హృదయం నాకు తెలుసు.....మనది పవిత్రమైన స్నేహం, ఈ ముద్దులవల్ల అపవిత్రమౌతుందా!" అంది.

"అవును" అన్నాడు సందేహించే గొంతుకతో.

"మళ్ళీ వొస్తాను."

"మరి సాయంత్రం ఒంటరిగా కలుసుకోవాలి."

"ఒంటరిగా యెదుకు? వొద్దు!"

"కాదు. నీతో మాట్లాడాలి."

"మాట్లాడేముకదూ? అన్ని మాటలు చెప్పాలా జ్ఞానం కలవాళ్ళకి. నాకర్థమయింది కదూ మన స్నేహబంధం!"

"వొస్తేనేం?"

"ఏం లేదు. ఎప్పుడో తీరకైనప్పుడు చూద్దాం లెండి. ఇప్పుడే మవసరం ?"

ఘోష్‌తో ఎక్కడికో వెళ్ళడానికి యిదో యెత్తు కావును అని పరిపరివిధాల ఆలోచించాడు.

సాయింత్రం చారుడివలె చూస్తే ఆడవాళ్ళతో ఉయ్యాల లూగుతోంది. ఘోష్ ఒక్కడూ ఏదో పోగొట్టుకున్న వాడివలె మైదానమంతా వెతుకుతున్నాడు.

సాయింత్రం ప్రయత్నించి ఆమెని తక్కిన వాళ్ళలోంచి విడతీసి-

"నేనింక నీతో మాట్లాడకండా వుండలేను. నువ్వొక్కసారి రావాలి."

"వొద్దు, ఎక్కడికీ కదల్లేను."

"బండి చేస్తాను."

"నాకు రావాలని లేదు. ఇక్కడ కూచుని మాట్టాడండి."

తనమాట వినక ఎదురుతిరిగే ఈస్త్రీని చూసి అతని పురుషత్వం మండిపడుతోంది. ఆమె ఎవరు? తనెవరు? కాని స్నేహంవల్ల కాని, జాలివల్ల కాని, స్త్రీ కొంచం పురుషుడికి స్వతంత్రమిచ్చిందా, ఇంక అతను తీసుకునే అధికారానికి అంతం వుండదు. చిటికినవేలు తాకడానికి వొప్పుకుంటే ఇంక ఆ శరీరమంతా, మనసూ, స్వేచ్ఛా అన్నీ తన స్వంతమూ, తన హక్కూ, తన ఆస్తే అనుకుంటాడు.

"నువ్వు రాకపోతే, ఇంతమాత్రం నా సరదా తీర్చకపోతే నీకు నామీద ప్రేమ యేమిటి?"

"నీమాట వినేరకం ప్రేమ వుందన్నానా? నన్ను మోసుకుపోతే నేను వూరుకుంటా నన్నానా?"

"కాదు, నీతో మాట్లాడాలంటే-"

"మాట్లాడు. ఇక్కడ?"

"వొస్తేనేం."

"ఎందుకు రావాలి?"

ఇంక గతిలేక కూచున్నాడు. కాని అంతసేపూ ఆమెని యెట్లా గాయం చెయ్యాలా అని చూస్తున్నాడు.

"పోనీ, అంత అయిష్టమైతే మానేద్దాం స్నేహం!"

"సరే!" అని లేస్తోంది.

"వెడుతున్నావా? నువ్వు మారిపోయినావు. నీ మన సెవరికో ఇచ్చావు. ఇంత చంచల మనుకోలేదు."

"నువ్వింత మూర్ఖుడవనుకోలేదు." వెళ్ళిపోయింది అని.

అక్కడే అతను ఆలోచిస్తో కూచున్నాడు. చల్లగాలికి రక్తంకూడా చల్లనై వివేక ముదయించింది. నిర్మలకోసం వెతికాడు. ఆమె ఒక్కత్తా వంటశాలల వెనక కూచునివుంది.

"నిర్మలా! నేను శుద్ధ గాడిదను!"

"నే నింకో గాడిదను. రా, యిట్లా వొచ్చి కూచ్చో!"

కొంచంగా చీకటవుతోంది. ఇంగువ తాలింపుల వాసనలు కొడుతున్నాయి. మెల్లిగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"ఏం చేస్తున్నావు రోజల్లా, చెప్పు" అంది.

చెపుతో నడుంమీద చెయ్యివేస్తే దూరంగా జరిగింది.

అతను ఆలోచించుకుంటున్నాడు. తాను చేసింది తప్పు. అంత చనువు తన సోదరితో తీసుకోడం అసహ్యమైనపని. బుద్ధిమంతురాలైన నిర్మల, ముందు తెరిపినపడి, తనని దూరాన వుంచుతుంది. ఆమెకి కృతజ్ఞుడై వుండాలి. ఇంక తమ యిద్దరి స్నేహమూ ఎంత మధురంగా వుంటుంది. ఎంత గొప్ప ఔన్నత్యాన్ని పొందుతుంది. జీవితమంతా ఎంత రసవంతంగా వుంటుంది. ఇద్దరూ ఎప్పుడూ నవ్వుతో మాట్లాడుతో మళ్ళీ ఎప్పుడయినా ఆమె మనసు మారినప్పుడు గట్టిగా, దగ్గిరిగా, విల్లువలె వున్న నడుం, ఆ నవ్వే కనుబొమ్మలూ-ఈ కాఠిన్య మేమవుతుంది. వుండదు-తాత్కాలికం-మళ్ళీ ఆ రాత్రివలె తన చేతుల్లో వూగుతూ - ఆగాడు! ఛీ! మళ్ళీ తలపులలా తిరిగాయి యేమిటి? అలాకాదు. ఈమె తన చెల్లెలు- అంతే. అంతవరకే-

పాపం, తను కమలనెంత అన్యాయం చేశాడు ! ఇంక ఎన్నడూ యే స్త్రీని తాకకూడదు. తన ఏకపత్నీవ్రతం పాలించ తలుచుకున్న యోధుడు-అతనికి కోపం తెప్పించాననేమో; నిర్మల అతని చేతిని మెల్లిగా వేళ్ళతో వెతుకుతోంది. అతి ప్రయత్నంతో తన చేతిని వెనక్కి తీసుకున్నాడు. తనకు మనోనిబ్బరముంది. తాను దేశసేవలో తన జీవితాన్ని ఆహుతి చేయ దలుచుకున్న ధీరుడు. ఈ స్త్రీ తనకేం లెక్కా! తన చేతిని

వెనక్కి తీసుకున్నందుకు కోపం రాలేదు కద. తను చేతినలా ఉంచితే తన చేతిని నడుముచుట్టూ పోనిస్తే వొప్పుకునేదేమో!

చంద్రుడు కాకినాడపురం మీదినుంచి ఉదయిస్తున్నాడు. తాటాకు దళ్ళూ ఇసికా మంత్రంకింది కొత్తలోకం ఉదయించినట్లు మేలుకుంది? ఇసిక వెండిగా, చెట్ల చిగుళ్ళు, తళుకు రేకులుగా, పక్కనవున్న గుండిగల్లో నీళ్ళు పాదరసంగా మారాయి. వెన్నెల వాళ్ళిద్దరి హృదయాల్లోకి రసత్వాన్ని భగ్గుమనిపించింది. కాని ఈమెతో స్నేహంచూసి ప్రజలేమను కుంటారు? అనుకోనీ, తన మనసు పవిత్రమైనప్పుడు ప్రజల అభిప్రాయాలు తుచ్ఛమైనవి.

"నిర్మలా, అలా తిరుగుదాం రాకూడదూ?"

"వొస్తాను, గాని మొన్నటివలె నన్ను బాధించకూడదు."

"బాధించానా?"

"ఊ !"

"బాధపడినట్టు లేవే!"

"కాని బాధే...మరి చెప్పు."

"నిజంగా బాధించను."

ఇసికలోంచి రైలుపట్టాలు దాటి వెళ్ళారు. ఒక చిన్న పల్లె వొచ్చింది. ఎవరూ బైట లేరు. కాని గుడిశల్లోంచి చిన్న దీపాలూ, భోజన ప్రయత్నంచేసే మనుషుల సంతోషరవాలు, పిల్లల మారాములూ వినపడుతున్నాయి. దాటి జీడిమామిడి తోపు దగ్గరికి వెళ్ళారు. అక్కడి ఇసికలో తీసిన దొరువు గట్టుమీద కూచున్నారు. ఎదురుగా వెన్నెల నీలమైన నీళ్ళమీదా, అడుగున యిసిక మీదా పడుతోంది. ప్రపంచమంతా వాళ్ళిద్దరి ప్రేమకోసం సృజించి నట్లుంది. ఏ యింద్రజాల మంత్రంవల్లనో ఆ నల్లని చెట్లనూ, మెత్తని ఇసికనూ, తెల్లని ఆకాశాన్ని కల్పించి, ఆ రాత్రికి వాళ్ళనాలోకంలో వొదిలింది విధి. ఆపలేని 'రోమాన్సు', భరింపలేని ఆనందం, అతని హృదయంలో వుడికిపోయినాయి.

"జీవితమంతా యిట్లావుంటే యెంత బావుంటుంది."

"వుండదు. యీ మనుష్యమాత్రులకి. కాని అప్పుడప్పుడు యేదో ఒక రాత్రి యిట్లాంటిది దేవతలు ప్రసాదిస్తారు."

"నీతో యిట్లా రావడం తెలివితక్కువపని."

"నావల్లనే!"

ఆమె మాట్లాడలేదు.

"మనిద్దరమూ, ఈ జీవితమంతా యిట్లా ఏకమై గడపబోతున్నాము. మనప్రేమ, ఆకాశంలో ఆ చంద్రుడివలె నిలిచి మనజీవితాల్ని యిట్లా చల్లగా నిర్మలంగా వెలిగిస్తుంది.

నిర్మలా! నా సందేహాన్ని తీర్చు. వెక్కిరింపుకి అన్నావా, నిజంగా అన్నావా, నువ్వు ఇక్కడే వుండి పోతావా?''

"వుంటాను.''

ఆమె బుజంమీద చెయ్యి వేశాడు. ఆమె ఆలోచిస్తో వూరుకుంది. దగ్గిరిగా ఆనుకుని కూచుని, ఆమెనికూడా లాక్కున్నాడు. తరవాత ఇంకా చనువు తీసుకోడానికి ప్రారంభం చెయ్యగానే.

"ఏమని వాగ్దత్తం చేశారు?'' అంది నెమ్మదిగా.

మాట్లాడకండా వదలి, దగ్గరగా కూచున్నాడు.

కాని యిద్దరికీ కూడా యేదో గొప్ప ఆరాటం జరుగుతున్నట్టు తెలుసు. చిన్నప్పట్నించి అలవాయిన ఆటంకాలు ఒక్కటొక్కటే ఆయుధాలు పట్టుకుని పైకి లేస్తున్నాయి. సహజంగా అనాదిగా ఈ జీవితాన్నే పాలించే శక్తులు, వాటి నొక్కొక్కదాన్నే నరికి కిందికి తోస్తున్నాయి.

నిర్మల కళ్ళల్లోంచి కన్నీళ్ళచుక్క జారి చెంపమీద వజ్రంవలె మెరుస్తోంది.

వద్దు, నేను నిన్నేం చెయ్యను.'' అంటూ ఆమెని కావలించుకుని యిసికమీదికి తన బరువుతో ఒరిగాడు. ఆమె మాట్లాడలేదు. ఒకరిపక్కన ఒకరు పడుకున్నారు. కొంచెంసేపట్లో జుట్టుకి యిసికకాకుండా అతను తన బుజాన్ని ఆమెకి యిచ్చాడు. అతను ఆమెని చాలాసార్లు ముద్దుపెట్టుకున్నాడు. కాని త్వరలో ధైర్యం కలగలేదు. ఏ నిముషాన తన మోహాన్ని గుర్తించి నిరాకరించి లేస్తుందో, ఏ నిమిషాన ఆ మహాయింద్రజాలం విచ్ఛినమౌతుందోనని భయం. ఆమెకి తనకున్న కోర్కెలేదనో, లేక స్త్రీకి సృష్టి పెట్టిన భయంవల్ల ఆమె నిరాకరిస్తుందో, అతనికి సందేహం. అతని ముద్దులకింద ఆమె పెదిమ కొంచంగా కదిలినప్పుడు అతనికి ధైర్యం కలిగింది గట్టిగా ఆమె మీదపడి ఒత్తుకున్నాడు. తరవాత అతనికేమీ సందేహం కలగలేదు. కళ్ళుమూసుకుని. తన చేతుల్లో అతనిమెడ కావిలించుకుని యింకా దగ్గిరగా లాక్కుంటోంది. రొమ్ముకి అతి ఆశతో, అతన్నదుముకుని, అతన్ని కదలనీకండా వుంది. ఒదిలితే యింకేమన్నా చేస్తాడని భయంవల్లనా లేక ఒక్క నిమిషమన్నా అతన్ని వదలలేకనా! కాని ఎంత గాఢంగా వున్నా అట్లా....నిష్కరుణుడుగా వుండడం అతనికి బాధగావుంది. ఈ ప్రపంచంలో, ఈ యింద్రజాలలోకంలో యింక యేం జరుగుతుందా అని ఆమె చూస్తున్న ట్టుంది. ఆమెకి తెలీకపోయినా, ఆమె శరీరంలోని అణువులు, నరాలు, సూక్ష్మజీవులు, అన్నీ శాంతిలో అంతమయ్యే అగ్నిజ్వాలకోసం తపిస్తున్నాయి.

"నువ్వు నాక్కావాలి అని ఆమె చేతుల్ని విదిలించుకుని, ఆమెకు మరణబాధతో తుల్యమైన చరమావస్థను కల్పించి ప్రమత్తనుగా చేసిందాకా వదలలేదు. ఆమె కూడా

అన్నిసందేహాలనూ, ఆలోచనలనూ ఒదిలి, అతనితో సమానంగా, ఆనందంగా, కళ్ళు విప్పిచూస్తో అనుభవించింది ప్రతి చిన్న చిన్న కామాలనూ అగాధమైన ఆలింగనాలనూ-

* * *

ఆ యిసికలోంచి అతన్ని ఒదిలించుకుని లేవడమే ఆవేశంగా లేచి కూచుంది. ఒక్క మాట లేకండా హృదయం పగిలేట్టు ఏడ్చింది.

"ఏం చేశావు? ఏమైనాను? నే నేమైనాను? ఇంకెట్లాబతకను?" అంటో యేడుస్తుంది.

అత నెంత సముదాయించినా ఎంత వేడుకున్నా, ఏం ధైర్యం చెప్పినా లాభంలేదు. అతనూ ఎక్కువగా ఆమెకోసం కష్టపడే స్థితిలో లేడు. అతనికి నిద్ర వస్తోంది. ఆ ఇసికలోనే అట్లానే పడి నిద్రపోవాలని వుంది. కష్టం మీద ఆమెతో చేరుకున్నాడు పాకలదగ్గరికి. ఏడుపు తప్ప ఆమె ఒక్కమాట మాటాడలేదు.

మర్నాడు ఆమె అతన్ని చూడకండానే కలకత్తావెళ్ళి ఘోష్‌ని పెళ్ళి చేసుకుంది. అతను నెలాఖరులోపల పోలీసు సబిన్స్పెక్టరు సెలక్షనుకి హాజరైనాడు.

◆ ◆ ◆

*రచనాకాలం : **1934***

*ప్రచురణ : (అదృష్టం కథల సంపుటి), ప్రేమచంద్ పబ్లికేషన్సు, **1964***